సమయం నాలుగు గంటలు కావొస్తుంది. ఎవరో తలుపు దబదబ బాదుతున్నారు. హఠాత్తుగా మెలకువ వచ్చింది రాజేశ్వరికి ఆ చప్పుడుతో. పక్కనేవున్న జానకమ్మను

# ఆదర్శమార్గం



నిద్రలేపింది. అమ్మా ఏవరో తలుపుకొడుతున్నారు.

ఈ వేళప్పుడు ఎవరే అని విసుక్కుంటూ మంచం దిగింది జానకమ్మ. ఇద్దరూ వెళ్ళి తలుపుతీశారు. ఎదురుగా చంద్రం ఆయాసపడుతూ నిలబడి వున్నాడు. ఈ వేళప్పుడు వచ్చావు ఏంటిరా అంది జానకమ్మ చిరాగ్గా.

ఇవాళ రాజి రిజల్ట్స్ వచ్చాయి అత్తయ్యా. మన ఊరికి పేపర్ వచ్చేలోగా ఏడు అవుతుందని పట్నం వెళ్ళి తీసుకువచ్చాను. ఇంతకూ పాస్ అయిందా? లేదా? మన రాజి పాస్ కాకపోతే ఇంకెవరు పాస్ అవుతారు అత్తయ్యా. ఫస్ట్ క్లాస్ కూడా వచ్చింది అన్నాడు తనకే వచ్చినట్టు ఆనందపడిపోతూ.

అదిసరే నిన్న రాజికి పెళ్ళి చూపులు ఇంట్లో ఆ పని ఈపని చూసుకుంటావు గదా అని నిన్ను రమ్మంటే ఎందుకు రాలేదురా.

మనసు బాగుండక రావాలనిపించలేదత్తయ్యా అంటూనే గబగబ నడుచుకుంటూ వెళ్ళి చీకటిలో కలసిపోయాడు.

ఏవిటే వాడు అలా వెళ్ళిపోయాడు? సరే నువ్వు తలుపువేసిరా అసలే నిన్న అంతా నిద్రలేదు అంటూ ఆవులిస్తూ లోపలికి వెళ్ళిపోయింది జానకమ్మ.

వీధిలోకి చూసింది రాజి. అంతే చిమ్మ చీకటిగా వుంది ఆమె మనసులాగే. తలుపువేసి నెమ్మదిగా వెళ్ళి పడుకుంది. ఆమె ఆలోచనలలో చంద్రం మెదలసాగాడు. చిన్నప్పటి నుంచి బావకు తనంటే ఎంత ఇష్టం. తన కోసం తోటి పిల్లలతో ఎన్నోసార్లు దెబ్బలాడాడు. ఎవరు చిన్నమాట అన్నా తనను అన్నట్టే వాళ్ళ మీదకు యుద్ధానికి వెళ్ళేవాడు. ముళ్ళను కూడా లెక్కచేయకుండా తను అడిగానని మొగిలిపువ్వు కోసుకొచ్చేవాడు. బావకు తనంటే ఎంత అభిమానం. ఆ అభిమానం పెరిగి ఇప్పుడు ప్రేమగా మారింది. కాని ఆ ప్రేమను బయటకు చెప్పకోలేకపోతున్నాడు. కారణం తన తండ్రి, తన ఆస్తి – అంతస్తులు.

రాజి తండ్రి పరంధామయ్య, చంద్రం తల్లి అన్నపూర్ణమ్మ అన్నాచెల్లెలు. చంద్రం తండ్రి చనిపోతే వున్న నాలుగు ఎకరాలను పండించుకుంటూ పదవ తరగతి వరకు చంద్రాన్ని చదివించింది అన్నపూర్ణమ్మ. తెలివిగా ప్రజలను వడ్డీ వ్యాపారంతో మోసం చేసి ఆస్తులు సంపాదించి ఆ ఊరి ప్రెసిడెంట్ అయ్యాడు పరంధామయ్య. వారి ఇద్దరి మధ్య మేనరికమువున్నా ఆస్తులలో తేడాలవల్ల ఇద్దరికీ గుండెలోని మాట గొంతుదాటి రావడం లేదు.

బావ ఎలాగూ తనకు తానుగా ధైర్యంగా పెళ్ళి చేసుకునేందుకు ముందుకు రాడు. ఆ ధైర్యం ఏదో తానే చేయాలి. జీవితంతో రాజీపడి నేను బ్రతకలేను. కట్నం కోసం పెళ్ళి చేసుకునేవాడికన్నా, తన కోసం ప్రాణం కూడా ఇవ్వడానికి సిద్ధంగా వున్న బావను చేసుకోవడానికే నేను సిద్ధపడడంలో తప్పులేదు. ఆమె ఒక దృఢనిర్ణయానికి వచ్చినట్టుగా మంచం దిగి టైమ్ చూసింది. నాలుగున్నర అవుతుంది. ఒకసారి తల్లి ముఖంలోకి చూసింది ఆమె ప్రశాంతంగా నిద్రపోతోంది. నేను చేసే ఈ పని నాకు తప్పు అనిపించడం లేదు. నీకనిపిస్తే నన్ను క్షమించు అని మనసులోనే అనుకుంది.

తలుపుతీసి వీధిలోకి అడుగుపెట్టింది బావతో జీవితం పంచుకోవాలనే ఆశయంతో. రెండు సందులు తిరిగి ఒక పెంకుటిల్లు ముందు ఆగింది రాజి. వరండాలోనే పడుకొనివున్న చంద్రం రాజిని చూసి గబగబ లేచి వచ్చాడు. ఏమిటి రాజి ఈ వేళప్పుడు వచ్చావు అన్నాడు ఆశ్చర్యపోతూ.

వచ్చేశాను బావ శాశ్వతంగా నీతో వుండిపోవడానికి అంది ఏడుస్తూ. చంద్రానికి అర్థం కాలేదు.

ఏమిటి రాజి నువ్వనేది? ఇంకా నీ ప్రేమను దాచుకోవాలని చూడకు బావ. ఇప్పటికైనా నీ అభిప్రాయం చెప్పు. నేనంటే నీకు పిచ్చి ప్రేమ కదూ చెప్పు బావ చెప్పు ఏడుస్తూనే అంది. ఇంక ఆగలేకపోయాడు చంద్రం. తన ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించిన రాజి ఏడుస్తుంటే చూడలేకపోయాడు. అవును రాజి ఇన్నాళ్ళు నా మనసు దాచుకున్నాను. నిన్న నేను ఎంత నరకయాతన పడ్డానో నాకే తెలీదు. నిన్ను చూడడానికి వచ్చిన వాళ్ళను నాలుగు తన్ని పంపుదామనుకున్నాను. కాని నీ అభిప్రాయం తెలుసుకోకుండా తొందరపడకూడదని ఆగిపోయాను. నువ్వు లేకుండా నేను బ్రతకగలనా రాజీ? నేనూ అంతే బావ. మనం ఇప్పుడే ఈ ఊరు విడిచి దూరంగా ఎక్కడికైనా పారిపోయి హాయిగా వుందాము. అలాగే రాజి అన్నాడు చంద్రం. ఇద్దరూ పట్నం వెళ్ళడానికి పడవ దగ్గరకు వెళ్ళారు.

పడవలో నుంచి అప్పుడే శంకరయ్య మాస్టారు దిగుతున్నారు. వాళ్ళ ఇద్దరిని చూసి పరిస్థితిని అర్థం చేసుకున్నారాయన. మీకు నేను మంచి చేస్తానని పిస్తే మా ఇంటికే పదండి అన్నాడు. ముగ్గురూ శంకరయ్య మాస్టారి ఇల్లు చేరారు.

ప్రేమికులు ఎప్పుడూ పిరికివాళ్ళు కాకూడదు. పిరికివాళ్ళకు ప్రేమించే అర్హత లేదు. ప్రేమ జయించాలంటే పిరికితనం పోవాలి. మీ పెళ్ళి మన ఊరిలోనే నేను జరిపిస్తాను. మాస్టారి మాట అంటే ఆ ఊరి ప్రజలకు అంత గౌరవం. అందుకే ఆయన మీద నమ్మకం కుదిరింది రాజికి, చంద్రానికి. పెళ్ళి చేసుకోగానే సరిపోదు. ఆ ప్రేమను మీరు కలకాలం బ్రతికించాలి. ప్రశాంతంగా వుండండి రేపే మీ పెళ్ళి అన్నాడు నవ్వుతూ మాస్టారు. పెళ్ళి అనేసరికి ఇద్దరూ సిగ్గుపడిపోయారు. తరువాత రోజే దగ్గర వుండి వాళ్ళ పెళ్ళి జరిపించారు. చంద్రం తల్లి అన్నపూర్ణమ్మ, జానకమ్మ కూడా ఆ వార్త విని సంతోషించారు. కాని పరంధామయ్య మాత్రం కోపంతో ఊగిపోతూ పెళ్ళి పందిరి దగ్గరకు వచ్చాడు. చంద్రం మీద విరుచుకుపడ్డాడు. ఇష్టం వచ్చినట్టు తిట్టసాగాడు. మాస్టారు కల్పించుకుని "చూడండి పరంధామయ్యగారు! పెద్దలు మూర్ఖత్వంతో పిల్లల మనసులు కష్టపెట్టకూడదు. వాళ్ళు వెళ్ళిపోయి ఎక్కడో పెళ్ళి చేసుకుని వస్తే మీ పరువు ఏమవుతుంది. నా మాట విని అన్ని మరచిపోయి వాళ్ళను ఆశీర్వదించండి" అన్నాడు.

పరంధామయ్యకు మాస్టారి మాటతో కళ్ళు తెరుచుకున్నాయి. వాళ్ళ ఇద్దరిని మనసారా ఆశీర్వదించాడు.

– పి. లక్ష్మి సుహాసిని